# కొసమెరుపు కథలు



## ఇదే లోకం!

అది ఒక పెద్ద నగరం.

ఆ పెద్ద నగరంలో అది ఓ పెద్ద కూడలి. అటుగా వచ్చేపోయే వాళ్లందర్నీ రోడ్డు పక్కన పడుకోబెట్టి గుడ్డ కప్పివున్న శవం కదిలించివేస్తోంది.

ఆ కదలికకూ, అందుకు కారణమైన వాళ్ల కరుణకూ చిహ్నాలుగా ఆ శవం చుట్టూ చెల్లాచెదరుగా చిల్లరనాణేలు...!

ఆ శవం తాలూకు వ్యక్తులెవరూ దగ్గరలో లేరు.

అటుగా వచ్చిన బీట్ కాన్‌స్టేబుల్ కూడా దుర్భిణి వేసి చూశాడు... ఎవ్వరూ తగల్లేదు. 'నిన్నింతటితో విడిచిపెడతానా? మళ్లీ వచ్చి ఓ పట్టుపట్టనూ?' అన్నట్లు తలెగరేసి ముందుకు కదలబోతున్నవాడల్లా చిల్లర మధ్య అయిదు రూపాయల నోటుని చూసిబిస్కెట్‌ని చూసి ఆగిన కుక్కలాఆగాడు.

ఎగిరి యజమాని చేతిలోని బిస్కెట్టును నోటితో అందిపుచ్చుకున్న కుక్కలా-శవం పక్కనుంచి ఆ అయిదు నోటును చటుక్కున అందిపుచ్చుకు ముందుకు కదిలాడు.

ఈ విషయాన్ని గమనిస్తున్న జంగయ్యకు ఒళ్లు మండింది.

కాన్‌స్టేబుల్ని మండించలేడు కాబట్టి అతను తనలో తనే మండిపోసాగాడు. అయినా ఏమీ చేయలేని తన అసమర్థతని తిట్టుకున్నాడు. తగలబెట్టాలనుకున్నాడు.

ఇంతలో మరో కరుణామయుడు మరో అయిదురూపాయల నోటుని శవం మీదికి విసిరేశాడు.

వెంటనే దాన్ని తీసుకుని, చిల్లరని మాత్రమే అక్కడ ఉంచాలనుకున్నాడు జంగయ్య. కానీ వెళ్తున్న కాన్‌స్టేబుల్ అలికిడి విని ఎక్కడ వస్తాడోనని తన ఆత్రానికి కళ్లెం వేశాడు.

ఇంతలో మరో బిచ్చగాడు అటుగా దూసుకువెళ్తూ ఠక్కున ఆ అయిదురూపాయల కాగితాన్ని అందుకుని, లేని ఓపికని తెచ్చుకుంటూ దూసుకువెళ్లిపోయాడు.

'ఛత్!... శవమ్మీద చిల్లర ఏరుకునే నాయాళ్లు!' జంగయ్య కోపం నసాళానికి అంటింది.

శవాన్ని తగలబెట్టడానికి కరుణామయులైన జనం వేసే చందాల్ని-చెప్పాపెట్టకుండా చటుక్కున పట్టుకుపోతున్న గద్దల్లాంటి వాళ్లని చూస్తుంటే ...కట్టెలు, కిరోసిన్ లేకుండానే జంగయ్య మనసు తగలబడుతోంది.

ఇంక లాభం లేదు... దూరంగా కూర్చుంటే శవం అద్దె కూడా మిగలదు...

ముందుకొచ్చాడు జంగయ్య. శవం పక్కనే కూర్చుని ఏడ్వడం ప్రారంభించాడు. మధ్యమధ్య వెక్కుతూ "బాబూ! హఠాత్తుగా గుండెపోటుతో పోయాడు. శవాన్ని తగలబెట్టడానిక్కూడా పైసల్లేవు. దయచేసి ధర్మం చేయండి!" అని దీనంగా అడుగుతున్న అతని మాటలు అటుగా తిరుగుతున్న చాలా గుండెల్ని కరిగిస్తున్నాయి.

ఆ కరిగిన జాలి చిల్లరగా మారి ఆ శవం మీద వర్షించసాగింది.

ఆ ప్రాంతంలో జనసంచారం పెరిగినకొద్దీ చిల్లర వర్షం పెరగసాగింది.

రెండు గంటల్లో శవం చుట్టూ ఎంతో చిల్లర... దాదాపు శవం బరువున్న చిల్లర!

అంతా పోగు చేసుకున్నాడు. చేతి సంచీ నిండింది. 'ఈ సంపాదన చాలు. లేకపోతే మళ్లీ ఏ క్షణమో గద్దలొచ్చి వాలి, వచ్చిన ఈ సంపాదనను తన్నుకుపోతాయి.' ఓ రిక్షాని కేకేశాడు.

"శవాన్నా? నా వల్లకాదు!" వెనకడుగు వేశాడతను.

"అహ.. ఆగు.. ఎక్కువిస్తాలే.." డబ్బుతో భయం పటాపంచలైంది.

అతనికే కాదు, ఈ ప్రపంచంలో ఎవరికైనా డబ్బిచ్చిన ధైర్యాన్ని బహుశా ఇంకెవ్వరూ, ఏదీ ఇవ్వలేదేమో!

ఆ శవాన్ని చాలా జాగ్రత్తగా పట్టుకుకూర్చున్నాడు జంగయ్య.

ఆ నగరంలోని ఓ పెద్ద ప్రభుత్వాసుపత్రి మార్చురీ రూమది. సరాసరి అక్కడికి వచ్చి ఆగింది రిక్షా!

వాళ్లని చూస్తూనే ముందుకొచ్చి శవాన్ని లోపలికి చేర్చడంలో సాయపడుతూ "చీకటిపడ్డా రాకపోతే బయపడి సత్తున్నాననుకో... " తన భయాన్ని మాటల్లోనే వ్యక్తపరిచాడు మార్చురీ కాపలాదారు దాసు.

"ఛ.. రాకుండా దీన్ని వట్టుకుని ఎక్కడికి పోతాను?" అంతవరకూ దేని అంత్యక్రియలకని అందర్నీ దేబిరించాడో ఆ శవాన్ని హీనంగా చూస్తూ అన్నాడు జంగయ్య.

బహుశా ఏ మంచి దర్శకుడైనా ఇతని హావభావాల్ని గమనించివుంటే తన చిత్రంలో మంచిపాత్రనిచ్చేవాడేమో కూడా!

ఇద్దరూ కలిసి శవాన్ని లోపలికి చేర్చారు. చేతి సంచీలోంచి కొంత చిల్లరని లెక్కెట్టి దాసు దోసిట్లో పోసి వెళ్లిపోయాడు జంగయ్య. వెళ్లేప్పుడు అతని చేతిసంచీలోని చిల్లర ఘల్లుఘల్లుమని శబ్దం చేయసాగింది... నడిచివెళ్తున్న చిల్లరదేవతలా వెళ్లిపోయాడు.

కన్నవాళ్లకీ, కట్టుకున్నదానికీ బ్రతికినన్నాళ్లూ ఇంత తిండికూడా పెట్టలేక... ఆకలితో అలమటించి... ఆఖరికి అనాథగా మరణించిన అతను... కాదు, అతని శవం అంతమందికీ అలా జేబులూ, కడుపులూ నింపింది. ఈ లోకానికి అతీతంగా వెళ్లిపోయాడు కాబట్టి అతను మాత్రం తన సంపాదనలో భాగం అడగలేడు... మర్నాడు మళ్లీ అలా ఎవరైనా తీసుకెళ్లినా వెళ్లడానికి సిద్ధమే!

వేదగిరి రాంబాబు